నమస్తే తెలంగాణ

తెలంగాణ జైత్రయాత్ర 2023

హైదరాబాద్ | బుధవారం 29 నవంబర్ 2023 www.ntnews.com

**పులుల్లా కొట్లాడి తెలంగాణ సాధించినం**

నాటి నుంచి నేటి దాకా తెలంగాణకు దుర్మార్గమైన కాంగ్రెసే శత్రువు. ఉన్న తెలంగాణను ఊడగొట్టి జబర్దస్తీగా ఆంధ్రలో కలిపింది కాంగ్రెసే. తెలంగాణ ఇస్తామంటే 2004లో పొత్తు పెట్టుకున్నాం. అయినా 15 ఏండ్లు ఏడిపించారు. మోసం చేసే ప్రయత్నం చేశారు. బీఆర్ఎస్ పార్టీని చీల్చే కుట్ర చేశారు. ఉద్యమాన్ని మొత్తం ఆగం పట్టించి మరోసారి ద్రోహం చేయాలనుకున్నారు. చివరకు 'కేసీఆర్ సచ్చుడో.. తెలంగాణ వచ్చుడో' అని నేను ఆమరణ నిరాహార దీక్ష చేస్తే, తెలంగాణ ప్రజలంతా పులుల్లా కొట్లాడితే విధిలేని పరిస్థితుల్లో తెలంగాణ ఇచ్చారు.

\- కేసీఆర్

బిగ్ స్టోరీ

## 2009, డిసెంబర్ 4..
### నిమ్స్ దవాఖాన..

ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్న కేసీఆర్.. మెతుకు ముట్టక ఆరు రోజులవుతున్నది. షుగర్ లెవల్స్ పడిపోతున్నాయి. ఒంట్లో సత్తువ లేదు. రెండు చేతులు జోడించి దండం పెట్టేందుకు కూడా శక్తి చాలడం లేదు. ఆరోగ్యం క్షీణిస్తున్నది. దీక్షను కొనసాగిస్తే ప్రాణాలకే ప్రమాదమని డాక్టర్లు హెచ్చరిస్తున్నారు. దీక్షను విరమించుకోవాలని ప్రభుత్వం విజ్ఞప్తి చేస్తున్నది.

*శారీరకంగా ఆయన బలహీనపడ్డారు కానీ మానసికంగా దృఢంగా ఉన్నారు. ఇప్పుడు కాకపోతే ఇంకా వందేండ్లయినా తెలంగాణ రాదని, రానివ్వరని బలంగా నమ్మారు. 'నేను చచ్చినా పర్వాలేదు.. తెలంగాణ వస్తే చాలు' అని సంకల్పం తీసుకున్నారు. ఈ సత్సంకల్పమే ఆయనకు దీక్షను కొనసాగించే శక్తినిచ్చింది.*

నవంబరు 29న దీక్షకు సిద్ధమైన కేసీఆర్‌ను కాంగ్రెస్ ప్రభుత్వం బలవంతంగా అరెస్టు చేసి ఖమ్మం జైలుకు తరలించింది. జైలులోనే ఆయన దీక్షను చేపట్టారు. కేసీఆర్ ఆరోగ్యం క్షీణిస్తుండటంతో ఆయనను ఖమ్మం జైలు నుంచి డిసెంబర్ 3న హైదరాబాద్‌లోని నిమ్స్ దవాఖానకు తరలించారు. కేసీఆర్ అరెస్టుకు చలించి ఆత్మబలిదానానికి ఒడిగట్టిన శ్రీకాంతాచారి అదే రోజు రాత్రి మృత్యువుతో పోరాడి తుదిశ్వాస విడిచారు. ఒకవైపు హైదరాబాద్‌కు తరలించిన కేసీఆర్ ఆరోగ్య పరిస్థితి విషమంగా మారుతున్నట్టు వైద్యుల హెచ్చరిక, మరోవైపు శ్రీకాంతాచారి మృతితో తెలంగాణ ఒక్కసారిగా ఉలిక్కి పడింది. అంతటా ఉద్రిక్త, ఉద్విగ్న పరిస్థితులు. అది తుఫాన్ ముందటి ప్రశాంతతలాంటిది. ఏ క్షణంలోనైనా బద్ధలయ్యే అగ్నిపర్వతంలా తెలంగాణ ఉన్నది. అదే జరిగితే పరిస్థితి చేయి దాటిపోయే ప్రమాదం. తెలంగాణ నలుమూలల నుంచి వేలాదిగా ఉద్యమకారులు భారీ సంఖ్యలో హైదరాబాద్‌కు తరలిరావడం మొదలయ్యింది. దీంతో ప్రభుత్వం అప్రమత్తమయ్యింది.





# 'నేను చచ్చినా ఫర్వాలేదు తెలంగాణ వస్తే చాలు'

- రాష్ట్రం కోసం చావుకు సిద్ధపడే దీక్షకు దిగాను
- నా మరణంతోనైనా తెలంగాణ ఇవ్వాల్సిందే
- ఉద్యమించేందుకు లక్షలమంది కేసీఆర్‌లను తయారుచేశాను.. ఈ తృప్తి చాలు

## నిమ్స్‌లో దీక్ష చేస్తూ.. కేసీఆర్ మాటలివీ

### నిమ్స్‌కు వచ్చిన దానం నాగేందర్

నిమ్స్ వెలుపల బారికేడ్లు, ముండ్ల కంచెలు, సాయుధ పోలీసు బలగాలతో కట్టుదిట్టమైన భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. టీఆర్ఎస్(బీఆర్ఎస్) ముఖ్యులు, కేసీఆర్ కుటుంబ సభ్యులను తప్ప ఎవరినీ లోపలికి అనుమతించడం లేదు. ఈ నేపథ్యంలో ఆనాటి ముఖ్యమంత్రి రోశయ్య తెలంగాణ మంత్రులతో అత్యవసరంగా సమావేశమయ్యారు. కేసీఆర్‌ను దీక్ష విరమింప జేయకపోతే పరిస్థితి చేయిదాటి పోయే ప్రమాదం ఉందని ఇంటెలిజెన్స్ వర్గాలు హెచ్చరించాయి. దీంతో ఒక మంత్రిని నిమ్స్‌కు పంపించి కేసీఆర్‌కు నచ్చజెప్పి దీక్షను విరమించేలా చేయాలని అత్యవసర సమావేశాన్ని ఏర్పాటు చేసింది. నిమ్స్‌కు వెళ్లి కేసీఆర్‌కు నచ్చజెప్పాలని అప్పటి వైద్యశాఖ మంత్రి దానం నాగేందర్‌ను ముఖ్యమంత్రి రోశయ్య ఆదేశించారు. నిమ్స్‌కు దానం నాగేందర్ వస్తున్నట్టు టీవీ చానల్స్‌లో బ్రేకింగ్ న్యూస్ రావడంతో అక్కడ పెద్దఎత్తున మోహరించిన మీడియా అప్రమత్తం అయ్యింది. నిమ్స్‌కు మంత్రి వచ్చే దృశ్యాన్ని చిత్రీకరించడానికి కెమెరాలను సిద్ధం చేసుకోవడంలో నిమగ్నమయ్యింది. అయితే, దానం మీడియా కండ్లుగప్పి నిమ్స్ వెనుక గేటు నుంచి లోపలికి వెళ్లారు. అప్పుడు దవాఖాన ఆవరణలో ఉన్న కేసీఆర్ కూతురు కవితకు ఈ సమాచారం అందడంతో హడావుడిగా లోపలికి వెళ్లింది. అప్పటివరకు ఆమెతో కేసీఆర్ ఆరోగ్యంపై ఆరా తీస్తున్న నేను కూడా ఆమె వెంట కేసీఆర్‌కు చికిత్స అందిస్తున్న రూమ్ నంబర్ 228లోకి వెళ్లాను. అప్పటికే అక్కడ దానం నాగేందర్ కూడా ఉన్నారు.

### మాకు ఇజ్జత్ ఇస్తున్నారంటే మీ పుణ్యమే: దానం

కేసీఆర్‌కు చికిత్సను అందిస్తున్న గదిలో డాక్టర్లు, నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ ప్రసాదరావుతో దానం నాగేందర్ చర్చించారు. దీక్ష విరమించకపోతే కేసీఆర్ ఆరోగ్య పరిస్థితి విషమంగా మారే ప్రమాదం ఉన్నదని, షుగర్, బీపీ లెవల్స్ పడిపోతున్నాయని డాక్టర్లు ఆందోళన వ్యక్తం చేశారు. డాక్టర్లతో మాట్లాడటం ముగిశాక కేసీఆర్‌తో మంత్రి నాగేందర్.. 'అన్నా.. విన్నారా.. దీక్ష విరమించకపోతే మీ ప్రాణాలకే ప్రమాదం" అని డాక్టర్లు చెబుతున్నారు. నా మాట వినండి. ఒక మంత్రిగా చెప్పడం లేదు. ఒక తమ్మునిగా అడుగుతున్నా. దీక్షను విరమించండి. మీరు, మేము అందరం కలిసి రాష్ట్రాన్ని తెచ్చుకుందాం . సీఎం రోశయ్య తన చేతిలో ఏమీ లేదని, అలాంటప్పుడు ఎలా హామీ ఇవ్వగలనని అంటున్నారు. మీ వల్లనే మాకు అంతోఇంతో గుర్తింపు, ఇజ్జత్ ఇస్తున్నారు. లేకపోతే మమ్మల్ని ఎవ్వరూ దేకరు. ఈ ఒక్కసారికి నా మాట వినండి' అంటూ రెండు చేతులు జోడించి వేడుకున్నారు. మంచంపై లేవలేని స్థితిలో ఉన్న కేసీఆర్ రెండు చేతులు బలవంతంగా జోడిస్తూ 'ఆయన(రోశయ్య) పరిధిలో ఉన్నదే చేయమను. అసెంబ్లీలో తీర్మానం చేయడానికైతే ఇబ్బంది లేదుగా' అని నిస్సత్తువ స్వరంతో ప్రశ్నించారు. 'ఆయనేమో తన చేతిలో లేదంటున్నారు. మీరు మరోసారి ఆలోచించండి. డాక్టర్లు మీ ప్రాణాలకే ప్రమాదమంటున్నారు' అని దానం అన్నారు. చేతికి సెలైన్ బాటిల్ పైప్‌లు ఉండటంతో ఛాతిపై రెండు చేతులు జోడించి కేసీఆర్ తల అడ్డంగా తిప్పారు. మంత్రి దానం తిరిగి వెళ్తూ అక్కడే నిలబడ్డ కవిత వైపు చూస్తూ.. 'మీరైనా సముదాయించండి' అని వెళ్లిపోయారు.

### కవితను వారించిన కేసీఆర్

తండ్రి ఆరోగ్యం క్షీణిస్తున్నదనే డాక్టర్ల హెచ్చరికలు అక్కడే ఉన్న కవితను ఆందోళనకు గురిచేశాయి. ఆమె కేసీఆర్‌ను చూడకుండా ఉండలేకపోతున్నారు. కానీ, పేగుబంధం ఎక్కడ తనను మానసికంగా బలహీనం చేస్తుందో అనేది కేసీఆర్ భయం. అందుకే, దవాఖానలో తనవద్దకు వచ్చిన కుమార్తెను ఆయన వారించారు.

> 'చచ్చినా పర్వాలేదు.. తెలంగాణ వస్తే చాలన్న దృఢ సంకల్పం తీసుకున్నా. అన్ని బంధాలు తెంచుకొని వచ్చే ఆమరణ నిరాహార దీక్షకు దిగాను. కన్నపిల్లలు కండ్ల ముందు కనబడితే మనసు మారుతుందేమో, పేగుబంధానికి మనసు చలిస్తుందేమో.. ఆ పరిస్థితి రాకుండా ఉండటానికి కొన్ని జాగ్రత్తలు తీసుకున్నా.. నన్ను చూడటానికి రావద్దని పిల్లలకు ముందే చెప్పాను. అయినా నా కండ్ల ముందు తిరిగితే ఎలా?' అని కూతురు కవిత వైపు ఆగ్రహంతో చూస్తూ కేసీఆర్ చేసిన వ్యాఖ్యలు ఇవి.

ఈ మాటలు అంటుంటే కేసీఆర్ కండ్లల్లో నుంచి నీళ్లు సుడులుగా తిరిగాయి. నిమ్స్‌లో చోటుచేసుకున్న ఈ భావోద్వేగ సన్నివేశానికి ప్రత్యక్ష సాక్షిని నేను. ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్న కేసీఆర్ పరిస్థితి ఎలా ఉన్నదో తెలుసుకుందామని పత్రికా విలేఖరిగా ఆసక్తితో కవిత వెంట ఆయన ఉన్న గదిలోకి వెళ్లినపుడు చోటు చేసుకున్న సన్నివేశం ఇది. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం చావోరేవో అని సిద్ధపడ్డ కేసీఆర్, తన ఆమరణ నిరాహార దీక్షలో ఎంతటి తెగింపు, పట్టుదల, చిత్తశుద్ధితో ఉన్నారో చూసిన ప్రత్యక్ష సాక్షిని. అయితే, కేసీఆర్ దీక్షపై అప్పుడప్పుడు కొందరు చేసే వెకిలి వ్యాఖ్యలు విన్నప్పుడు నిమ్స్‌లో నేను ప్రత్యక్షంగా చూసిన భావోద్వేగ సన్నివేశం ఇప్పటికీ నా కండ్లముందు కదలాడుతుంది.



## డిసెంబర్ 9 నాటి పరిణామాలు

**కేసీఆర్** ఆమరణ నిరాహార దీక్ష 11వ రోజుకు చేరుకుంది. దీక్ష కొనసాగిస్తే ప్రాణాలకే ప్రమాదం అని డాక్టర్లు హెచ్చరించారు. తెలంగాణపై ప్రకటన రానిదే తాను దీక్ష విరమించేది లేదని కేసీఆర్ పట్టుదలతో ఉన్నారు. తెలంగాణవ్యాప్తంగా ఆందోళనలు తీవ్రంగా సాగుతున్నాయి. దీంతో కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోక తప్పని పరిస్థితి ఏర్పడింది. రోశయ్యను కాంగ్రెస్ అధిష్ఠానం ఢిల్లీకి పిలిపించింది. ఇటు రాష్ట్ర అసెంబ్లీలో కూడా తెలంగాణపై తీర్మానం చేయాలంటూ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు వాయిదా తీర్మానం ఇచ్చారు. పార్లమెంటులో కూడా ఎంపీలు ఆందోళన చేపట్టారు. అసెంబ్లీలో రోశయ్య, ఇటు పార్లమెంటులో స్పీకర్ మీరాకుమార్ ఇద్దరూ కేసీఆర్‌ను దీక్ష విరమించుకోవాలని కోరారు. కేంద్రమంత్రి చిదంబరం కూడా కేసీఆర్‌తో ఫోన్లో మాట్లాడారు. ఎవరెన్ని చెప్పినా తెలంగాణపై ప్రకటన రానిదే తాను దీక్ష విరమించేది లేదని కేసీఆర్ స్పష్టం చేశారు. రాత్రి 8 గంటలకు సోనియా గాంధీ నివాసంలో జరిగిన కాంగ్రెస్ కోర్ కమిటీ సమావేశంలో తెలంగాణ ఏర్పాటు చేయక తప్పదనే నిర్ణయానికి వచ్చారు.

# ఇప్పుడు రాకపోతే వందేండ్లయినా రాదు

**\- నిమ్స్‌లో కేసీఆర్‌తో ఇంటర్వ్యూ**

ఒక జర్నలిస్టుగా కేసీఆర్ ఆరోగ్యంపై నిమ్స్ దవాఖాన వద్ద ఆయన కూతురు కవితను నేను ఆరా తీస్తున్న సమయంలో దానం నాగేందర్ వచ్చారన్న సమాచారం కవితకు అందింది. కవితతో పాటు నేను కూడా కేసీఆర్ ఉన్న గదిలోకి వెళ్లాను. కవిత వెంట వెళ్లడంతో వారి తాలూకు వ్యక్తే అయి ఉండవచ్చని భావించి పోలీసులు నన్ను అడ్డగించలేదు. అలా నిమ్స్‌లోకి వెళ్లి కేసీఆర్‌ను ఇంటర్వ్యూ చేశాను. ఆ పరిస్థితుల్లో కేసీఆర్‌ను ఇంటర్వ్యూ చేసిన ఏకైక జర్నలిస్టును కావడం నాకు వ్యక్తిగతంగా గర్వించదగ్గ అంశం. ఆ సమయంలో కేసీఆర్ శారీరకంగా బలహీనంగా కనిపించినా, మానసికంగా మాత్రం చాలా దృఢంగా కనిపించారు. కచ్చితంగా తెలంగాణ ఏర్పాటు ప్రకటన వస్తేనే దీక్ష విరమించాలని పట్టుదలతో ఉన్నారు. ఒకవేళ తాను బతికి ఉండగా ఈ ప్రకటన రాకపోతే, చచ్చిపోయినంకైనా వస్తే చాలు అనే భావనలో కేసీఆర్ కనిపించారు.

***మీ ఆరోగ్య పరిస్థితి రోజురోజుకూ విషమంగా మారుతున్నది. దీక్ష విరమించమని వైద్యులు, ప్రభుత్వం కోరుతున్నది కదా?***

దీక్ష విరమిస్తే ఫలితమేంటి చెప్పండి.

***ప్రాణాలకే ప్రమాదం అంటున్నారు!***

నేను చచ్చినా పర్వాలేదు, తెలంగాణ రాష్ట్రం వస్తే చాలని మానసికంగా, భౌతికంగా సిద్ధపడే దీక్ష నిర్ణయం తీసుకున్నా. ఇప్పుడు కూడా తెలంగాణ రాకపోతే వందేండ్లు అయినా రాదు. నా చావుతోనైనా తెలంగాణ వస్తే చాలన్న దృఢ సంకల్పంతో ఉన్నా.

***దీక్ష విరమిస్తే ఆ తర్వాత అందరం కలిసి రాష్ట్రాన్ని సాధించుకుందామని అంటున్నారు కదా?***

రాష్ట్రం ఇస్తామన్న ఒక్క మాటకు తప్ప దేనికీ అంగీకరించను... దీక్ష విరమించను.

***ఇప్పటికే మీ ఆరోగ్యం బాగా క్షీణించిందని వైద్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.***

ఆరు రోజులుగా నిరాహార దీక్ష చేయడం వల్ల భౌతికంగా బలహీనపడవచ్చునేమో.. కానీ మానసికంగా మాత్రం బలహీనంగా లేను. నా ప్రాణాన్ని పణంగా పెట్టి దీక్షకు దిగడం వల్ల తెలంగాణ రాష్ట్రాన్ని ఇస్తారా? ఇవ్వరా అనేది ఆలోచించడం లేదు. నేను బతికి ఉండగా తెలంగాణ ఇవ్వకపోతే...నేను చచ్చిన తర్వాత అయినా ఇవ్వక తప్పదు కదా.

***పోరాడి సాధించుకోవాలి తప్ప ప్రాణ త్యాగానికి సిద్ధపడటం సమంజసమా?***

నాకు చావు అంటే భయం లేదు. అన్నింటికీ సిద్ధపడే చివరకు ఈ నిర్ణయం తీసుకున్నా. ఒక లక్ష్యం కోసం, నాలుగు కోట్ల మంది ప్రజల ఆకాంక్షల కోసం చనిపోయానన్న ఆత్మ తృప్తి మిగులుతుంది నాకు.. అది చాలు.

***తెలంగాణ రాష్ట్ర సాధనలో కృతకృత్యులు అయినట్టు భావిస్తున్నారా?***

రాష్ట్ర సాధనలో నేను కృతకృతుడిని అయ్యానో లేదో ఇప్పుడు తెలియదు కానీ, తెలంగాణ కోసం పోరాడేందుకు లక్షలాది మంది కేసీఆర్‌లను తయారు చేశానన్న సంతృప్తితో హాయిగా కన్ను మూస్తా.

***తెలంగాణ రాష్ట్రం అనేది తన పరిధిలో లేని అంశం... అలాంటప్పుడు ఎలాంటి హామీ ఇవ్వగలనని సీఎం రోశయ్య అంటున్నారు.***

శాసనసభలో తీర్మానం చేయడమనేది ఆయన పరిధిలోని అంశమే కదా?. సభలో తీర్మానం ప్రవేశపెడితే వ్యతిరేకించేవారు ఎవరున్నారు?. ప్రతిపక్ష టీడీపీ కూడా మద్దతు ఇస్తామని ప్రకటించింది. ఇక్కడ సభలో తీర్మానం చేసి పంపిస్తే ఆ తర్వాత ఎలాగూ కేంద్రం ప్రత్యేక రాష్ట్రాన్ని ఇవ్వక తప్పదు కదా?

***శ్రీకాంతాచారి తుదిశ్వాస విడిచారు..***

(ఈ విషయాన్ని ప్రస్తావించగానే కేసీఆర్‌లో దుఃఖం పొంగుకొచ్చి కండ్ల నుంచి కన్నీరు ధారలై పారింది) శ్రీకాంత్‌ను కడసారి చూసేందుకైనా అనుమతించండి.. ఉస్మానియాకు వెళ్లి వస్తానని అధికారులను ఎంతగా వేడుకున్నా వాళ్ల మనసు కరగలేదు.(అంటూ కేసీఆర్ దు:ఖాన్ని ఆపుకోలేక పోయారు. ఆ తర్వాత కొద్దిసేపటికి తమాయించుకొని..) నా కన్నీటి బొట్లే శ్రీకాంత్‌కు నేను అర్పించే అశ్రునివాళి.

(ఇంతలో డాక్టర్లు వచ్చి ఆయనతో మాట్లాడించవద్దని వారించారు. దీంతో కేసీఆర్ నావైపు చూస్తూ ఇక వెళ్లమన్నట్టు రెండు చేతులు జోడించి సైగ చేశారు.)

... వెల్జాల చంద్రశేఖర్
సీనియర్ జర్నలిస్ట్